క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో కొలువైన శ్రీలక్ష్మీ, గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకిసేవను సాయంత్రం జరిపారు. అభిషేకాలు, పూజలు చేసి, భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

మహిళా విభాగం టౌన్ అధ్యక్షురాలిగా జ్యోత్స్న


భీమతాటి జ్యోత్స్న

కోవూరు: వైఎస్సార్‌సీపీ కోవూరు టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా భీమతాటి జ్యోత్స్నను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. ఈ క్రమంలో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరు, మైపాడు, గంగపట్నం, రాముడుపాళెం, కొమరిక తదితర గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నరసింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లా కోర్టులో ఈ-సేవా కేంద్రం


ఈ-సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ-సేవా కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన న్యాయపరమైన సమాచారం ఈ సేవా కేంద్రం ద్వారా తెలుసుకోవచ్చని, కక్షిదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల్లో ఉచిత న్యాయ సహాయం తదితర న్యాయ సేవా సదుపాయాలు ఇక్కడ తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యపరెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్క నాగరాజు పాల్గొన్నారు.

టీబీ నివారణకు సహకరించాలి



నెల్లూరు(అర్బన్): జిల్లాలో టీబీ నివారణకు ప్రైవేటు డాక్టర్లు కూడా సహకరించాలని జిల్లా టీబీ, ఎయిడ్స్, కుష్ఠు నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. బీవీనగర్‌లోని శారదా ఆస్పత్రి, కిరణ్ హాస్పిటల్, శ్రీహరి నగర్‌లోని పైన్ ఆస్పత్రులను శనివారం ఆయన పరిశీలించారు. ఆయా ఆస్పత్రుల డాక్టర్లతో ఖాదర్‌వలీ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం లాంటి లక్షణాలున్న రోగులు వస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. పబ్లిక్, ప్రైవేటు మిక్స్ కో-ఆర్డినేటర్ హరీస్, భవ్య సెంస్థ కో-ఆర్డినేటర్ తులసీరామ్, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణి, పూజితకు సన్మానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కాకాణి పూజితలను మహిళా నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి


ఉపాధ్యాయులతో ఆనం అరుణమ్మ తదితరులు

పొదలకూరు: జెడ్పీ హైస్కూళ్లలో ఉత్తమ ఫలితాలను సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని ఆదేశించారు. కాగా శిథిల భవనాలను కూల్చగా, వాటి నుంచి వచ్చిన కలప పాఠశాలలో చాలా రోజులుగా ఉందని, వేలమేసే విషయమై ఎంపీడీఓకు లేఖ రాసినా స్పందించడం లేదని ఉపాధ్యాయుడు నాగిరెడ్డి తెలియజేశారు. దీంతో వెంటనే కలప వేలానికి అనుమతిని అందజేయాలని ఆమె ఆదేశించారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

నివేదిక మేరకు వివాద పరిష్కారం

జిల్లా సర్వేయర్ నివేదిక మేరకు స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల స్థల వివాదాన్ని పరిష్కరించనున్నామని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు పేర్కొన్నారు. హైస్కూల్ పరిశీలన నిమిత్తం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించారనే ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా సర్వేయర్ ద్వారా ఇటీవల కొలతలేయించామని చెప్పారు. నివేదికను అందజేసిన వెంటనే చర్యలు చేపట్టనున్నామని వివరించారు. జలజీవన్ మిషన్ పనులను త్వరతగతిన చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీడీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగిరెడ్డి ఉద్యోగ విరమణ పొందనున్న తరుణంలో ఆయన్ను సహచర ఉపాధ్యాయులు సత్కరించారు. ఆయన శేషజీవితం హాయిగా సాగాలని కాంక్షించారు.

పునరావాస కేంద్రాల్లో పనులు వేగవంతం

- కలెక్టర్ ఆనంద్


మాట్లాడుతున్న ఆనంద్

ముత్తుకూరు(పొదలకూరు): థర్మల్ పవర్ ప్రాజెక్టులతో కాలుష్యంలో చిక్కుకున్న గ్రామాల తరలింపులో సమస్యలున్నాయని, పునరావాస కేంద్రాల పనులను వేగవంతం చేయనున్నామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. పైనాపురం, నేలటూరు, కృష్ణపట్నం పంచాయతీల్లోని గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు పనుల్లో జాప్యం నెలకొన్న మాట వాస్తవమేనని చెప్పారు. బాధిత గ్రామస్తులు తన వద్దకొచ్చి వినతిపత్రాలను అందజేస్తున్నారని వివరించారు. జెన్‌కో తదితర యాజమాన్యాలతో మాట్లాడి తాత్కాలికంగానైనా గ్రామాల్లో రోడ్లు, మంచినీటి సౌకర్యం తదితర వసతులను కల్పించనున్నామని వెల్లడించారు. సర్పంచ్ కావలి విజయ్‌కుమార్, శ్రీనివాసులు రెడ్డి, సాయిశశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారంలో వెంకయ్యస్వామి



మనుబోలు: మనుబోలు – చెర్లోపల్లి మార్గంలోని వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకం తదితరాలను అర్చకుడు శ్రీనివాసులు జరిపారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయం వద్ద హోమగుండం వేసి ధుని పూజ చేశారు. భక్తులకు అన్నదానాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, అనూష వ్యవహరించారు.

గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజన్లకు ఇచ్చే గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని బుచ్చిరెడ్డిపాళెం మండల ఆవాజ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శనివారం నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై ఆధారపడి జీవిస్తున్న పేద ఇమామ్‌లు, మౌజన్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వస్తే గౌరవ వేతనం రూ.5000 నుంచి రూ.7000 చేస్తామని హామీ ఇచ్చారని, అంతేకాక నెలనెలా క్రమం తప్పకుండా చెల్లిస్తామని చెప్పి ప్రస్తుతం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి ఆరునెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి మునీర్ అహ్మద్, మండలాధ్యక్షుడు జక్రియ, జిల్లా కమిటీ సభ్యుడు జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి



విడవలూరు: మండలంలోని ముదివర్తి గ్రామ శివారులో గానుగపెంట శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. సుమారు 55 ఏళ్ల శ్రీనివాసులురెడ్డి గత రెండు రోజులుగా ముదివర్తి గ్రామ శివారులో చెట్టు కింద ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఆయన చలనం లేకుండా ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కామాక్షితాయి హుండీ కానుకల లెక్కింపు

- రూ.53 లక్షల ఆదాయం


హుండీ కానుకలను లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో శనివారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం జరిగింది. మే 25 నుంచి ఆగస్టు 30 వరకు ప్రధాన హుండీల ద్వారా రూ.53,44,906 లక్షల నగదు ఆదాయం లభించింది. నగదు కాకుండా యూఎస్ డాలర్లు 5, కెనడియన్ డాలర్లు 15, సింగపూర్ డాలర్లు 5, థాయిలాండ్ బాత్ 120, ఉక్రెయిన్ హ్రివ్నియా 150, యూఏఈ దిర్హమ్స్ 15, సౌదీ రియాల్స్ 5, బంగారు 64 గ్రాములు, వెండి 340 గ్రాములను భక్తులు సమర్పించారని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు జనార్దన్‌రెడ్డి, నాగమల్లేశ్వరరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృత్యువాత

వెంకటాచలం: సాగునీటి కాలువలో ప్రమాదవశాత్తూ పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నిడిగుంటపాళెంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. నిడిగుంటపాళేనికి చెందిన నరసయ్య (54) ఈ నెల 28 నుంచి కనిపించకపోవడంతో గ్రామంలో అన్ని చోట్ల కుటుంబసభ్యులు వెతికారు. ఈ తరుణంలో గ్రామ సమీపంలోని సాగునీటి కాలువలో పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులకు మృతుడి కుమారుడు నరేష్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బుచ్చిలో కనీస వసతులు కరువు

- తాగునీటికీ దిక్కులేదు
- నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు


సమస్యలపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ యానాదిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు యానాదిరెడ్డి, ప్రమీలమ్మ, అనంతమ్మ, జయంతి, షకీలాబేగం పట్టణంలోని సమస్యలపై ఏకరువు పెట్టారు. నగర పంచాయతీలోని అనేక ప్రాంతాల్లో మౌలిక వసతులు కరువయ్యాయని, ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీధి లైట్లు లేకపోవడం, ఇష్టారాజ్యంగా తవ్విన గుంతలలో నీరు చేరి పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. పట్టణంలో కనీస వసతులు కూడా కల్పించకపోతే ప్రజలకు తాము ఏమి సమాధానం చెప్పాలని వాపోయారు. ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాగునీటి పైపులైన్లలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తే సమస్య కొంతవరకు తీరుతుందని వివరించారు. అలాగే డ్రెయినేజీల్లో పూడికలు, చెత్త తరలింపు చర్యలు ఎప్పటికప్పుడు చేయాల్సిన అవసరం ఉందని, కొన్ని ప్రాంతాల్లో చెత్త తరలించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. అనంతరం కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. తాగునీటి విషయంలో అమృత్ 2.0 ఎస్ఎస్సార్ తాగునీటి పథకం పూర్తయితే ఇబ్బందులు ఉండవని వివరించారు. నగర పంచాయతీ ఆదాయానికి తగ్గట్లు ప్రాధాన్యతా క్రమంలో అన్ని పనులు చేయిస్తామని పేర్కొన్నారు. మరికొన్ని సమస్యలపై కౌన్సిలర్లు ప్రస్తావిస్తుండగా కమిషనర్ లోపలికి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజల సమస్యలపై తాము ప్రశ్నిస్తుంటే లోపలికి వెళ్లిపోవడం ఏంటని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. అంతకుముందు సమావేశంలో అజెండాలో పొందుపరచిన వివిధ అంశాలకు సంబంధించిన ఐదు పనులకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు లేకపోతే దుబారా ఎందుకు

నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కనీస సౌకర్యాలకే దిక్కులేకపోతే కమిషనర్ దుబారా ఖర్చులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ 16వ వార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ ఆరోపించారు. బలరామ్‌నగర్‌లోని స్థలానికి రూ.20 లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మించారని, ఈ నిధులు అత్యవసర పనులకు వాడితే బాగుండేదన్నారు. అలాగే 16వ వార్డులో షాపింగ్ కాంప్లెక్స్‌లకు వేలంపాటల ద్వారా ఎంత ఆదాయం వచ్చిందో కమిషనర్ చెప్పలేదన్నారు. ఈ సమాచారం అడిగి రెండు నెలలు కావస్తున్నా స్పందన లేకపోవడం దారుణమని వాపోయారు. గాంధీనగర్ సచివాలయ నిర్మాణంపై అర్జీ ఇస్తే అర్జీని కనీసం చూడలేదని చెప్పడం బాధాకరమని, ఫోన్ చేసినా కమిషనర్ స్పందించకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

అధ్యయన కేంద్ర అభివృద్ధికి సమష్టి కృషి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని సందర్శిస్తున్న వెంకయ్యనాయుడు

వెంకటాచలం: ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషి అవసరమని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మండలంలోని సరస్వతీనగర్‌లో గల ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని శనివారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కేంద్రం జిల్లాలో ఏర్పాటయ్యేందుకు తానెంతో కృషి చేశానని తెలిపారు. నేటి తరానికి మాతృభాష ప్రాధాన్యాన్ని చెప్పే పరిస్థితి రావడం దురదృష్టకరమని చెప్పారు. ఉప రాష్ట్రపతి పదవి అనంతరం తనకొస్తున్న పింఛన్ మొత్తంలో ఈ కేంద్రానికి రూ.ఐదు లక్షలను త్వరలో అందజేస్తానని ప్రకటించారు. కేంద్ర డైరెక్టర్ సంపత్‌కుమార్ రచించిన కృష్ణ రాయలకీర్తి.. ప్రభల జానకి రచించిన హరికథ సాహిత్య సింధు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం అక్షర విద్యాలయంలోని సోమా శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు.

సొసైటీ మాజీ చైర్మన్‌కు మాతృవియోగం


నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సొసైటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి తల్లి గోగిరెడ్డి పెంచలమ్మ (97) మండలంలోని మహ్మదాపురంలో శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు. గోపాల్‌రెడ్డికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, నేతలు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, లచ్చారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సమావేశం



కోవూరు: వైఎస్సార్‌సీపీ మండల సమన్వయ కమిటీ సమావేశం కోవూరులోని కాటంరెడ్డి దినేష్‌రెడ్డి నివాసంలో శనివారం జరిగింది. పార్టీ మండల కన్వీనర్ ఆత్తిపల్లి అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రైతుల సమస్యలపై చర్చించారు. అలాగే సెప్టెంబర్ 2న దివంగత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన శివుని నరసింహులురెడ్డిని అభినందించారు.

క్లస్టర్ సమావేశానికి హాజరుకావాలి



ఇందుకూరుపేట: క్లస్టర్ సమావేశానికి ఉపాధ్యాయులు తప్పక హాజరు కావాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని కొత్తూరులో జరిగిన క్లస్టర్ సమావేశాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన నిర్మాణాత్మక మూల్యాంకనం పుస్తకాలను ప్రతి ఉపాధ్యాయుడు సమగ్రంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

విఘ్నేశ్వరుడికి పూజలు


పొదలకూరు: నర్సారెడ్డికాలనీలో లడ్డూ వేలం


వెంకటాచలం: తిక్కవరప్పాడులో..

పొదలకూరు: వినాయక చవితిని పురస్కరించుకొని గణనాథుడికి ప్రత్యేక పూజలను శనివారం నిర్వహించారు. పద్మావతినగర్‌లో అన్నదానం చేశారు. పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో పది కిలోల లడ్డూను రూ.17 వేలకు మన్నెం శ్యామ్‌ప్రసాద్ దక్కించుకున్నారు. శింగయ్యచేనులో లడ్డూ వేలాన్ని నిర్వహించారు.

వెంకటాచలం: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుడి ప్రతిమల నిమజ్జనాన్ని నిర్వహించారు. తిక్కవరప్పాడు, అనికేపల్లి, గొలగమూడి, కంటేపల్లి, కాకుటూరు, సర్వేపల్లి తదితర గ్రామాల్లో గల కాలనీల్లో వినాయకుడి విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

- మండలంలోని చెముడుగుంటలో సాంస్కృతిక కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాయి బాలాజీ నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. శివలీలలు పౌరాణిక నాటకం, అన్నమయ్య భక్తి కీర్తనలు, జానపద గీతాలను ఆలపించారు.
- బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని 11వ వార్డు సిండికేట్ "బ్యాంక్ వీధిలో శనివారం 500 మందికి అన్నదానం చేశారు. స్థానిక కౌన్సిలర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొని. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- కొడవలూరు: నార్తురాజుపాళెం సర్కారుతోపులో ప్రతిష్ఠించి ఉన్న వినాయక ప్రతిమ వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సార్‌కేటీ యూత్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఆదివారం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: 11వ వార్డులో..


వెంకటాచలం: చెముడుగుంటలో..


కొడవలూరు: నార్తురాజుపాళెంలో..

రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు


ఎడ్ల పందేలు


పాటూరు తూర్పుపాళెం జట్టుకు బహుమతి ప్రదానం

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు పంచాయతీలో రాష్ట్ర స్థాయి ఎడ్లపందెం పోటీలను శనివారం నిర్వహించారు. పోలేరమ్మ యువజన సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 29 ఎడ్ల జతలు హాజరయ్యాయి. 4.44 నిమిషాల వ్యవధిలో గమ్యాన్ని చేరుకొని పాటూరు తూర్పుపాళెం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. కుర్లకుంట ప్రభాకర్ – కోవూరు.. నల్లబోతు గోపీకృష్ణ – పమిడజోడు, బాపట్ల జిల్లా.. వెంకట మోక్షిత – గంగవరం.. మద్దిశెట్టి శ్రీనివాసులు – పడుగుపాడు వరుస స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నగదు పురస్కారంతో పాటు షీల్డులను అందజేశారు. మాజీ సర్పంచ్ ఆకుల మధు, కార్యనిర్వాహకులు సోడం నవీన్, అన్నం సాయి, కొణతం క్రాంతి, తలారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.